క్లుప్తంగా

పీహెచ్‌సీలకు గర్భిణుల తరలింపు



గర్భిణులను పరీక్షిస్తున్న వైద్యులు

వేలేరుపాడు: భారీ వర్షాలు, వరద మూలంగా వేలేరుపాడు మండలంలోని పలువురు గర్భిణులను ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు చేరుస్తామని ఐసీడీఎస్ పీడీ కె.పద్మావతి తెలిపారు. శుక్రవారం సునీత అనే గర్భిణితో పాటు మరో గర్భిణిని అంబులెన్స్‌లో వేలేరుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించామన్నారు. మండలంలోని 12 నివాసిత ప్రాంతాల్లో 31 మంది గర్భిణులను, 27 మంది బాలింతలను గుర్తించామన్నారు. వారికి అవసరమైన వైద్య సేవలు అందిస్తామన్నారు.

బోరు నుంచి ఎగసిపడిన నీరు



బోరు నుంచి ఎగసిపడుతున్న నీరు

కామవరపుకోట: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో వరద నీరు కారణంగా ఓ రైతు పొలంలో విచిత్రంగా బోరు నుంచి నీరు ఎగసిపడింది. వివరాల్లోకెళితే మండలంలో కేఎస్ రామవరానికి చెందిన సంకుల రాటాల రాజు ఉదయం వ్యవసాయ పనుల నిమిత్తం తన పొలంలోకి వెళ్లి చూడగా పొలం చుట్టూ వరద నీరు చేరి, పొలంలో వేసిన బోరు నుంచి నీరు ఎగసిపడుతూ రావటంతో గ్రామస్తులు ఆశ్చర్యంగా వీక్షించారు. రెండు గంటల పాటు ఇదే విధంగా బోరు నుంచి నీరు ఎగసిపడి క్రమేపీ తగ్గినట్లు గ్రామస్తులు తెలిపారు.

ముంపులో 630 ఎకరాల వరి పంట

ద్వారకాతిరుమల: మండలంలో మొత్తం 630 ఎకరాల్లో వరి పంట నీట మునిగినట్లు మండల వ్యవసాయాధికారి ఎ.దుర్గారమేష్ తెలిపారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ఐఎస్ జగన్నాథపురంలోని ఎర్రకాలువ పొంగడంతో ఆ గ్రామంలోని పొలాలతో పాటు, ఐఎస్ రాఘవాపురంలోని వరి పంటలు పూర్తిగా నీట మునిగాయి. రెండు గ్రామాల్లోని పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. అలాగే పి.కన్నాపురం చుట్టు పక్కల గ్రామాల్లోని పంట పొలాల్లోకి సైతం నీరు భారీగా చేరింది.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఇద్దరు భక్తులు వేరువేరుగా శుక్రవారం రూ.4,28,000 విరాళంగా అందజేశారు. అందులో భాగంగా పినకడిమికి చెందిన వెంకచేజెర్ల శ్రీనివాస్ రూ.3,12,000, కామవరపుకోట మండలం కళ్ల చెరువుకు చెందిన మురుముకం శ్రీనివాస్ రూ.1,16,000 నిత్యాన్నదాన కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతలకు నిత్యాన్నదాన ట్రస్టు సూపరింటెండెంట్ డీవీఎస్ రాజు విరాళం బాండ్ పత్రాలను అందించారు.

ప్రజల శ్రేయస్సే ముఖ్యం

వేలేరుపాడు: భారీ వర్షాలు, పెదవాగు ముంపు ప్రాంతాల్లో శుక్రవారం పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పర్యటించారు. మూడు రోజులుగా భారీగా కురుస్తున్న వర్షానికి పెద్దవాగు ప్రాజెక్టు తెగి గ్రామాలు ముంపునకు గురయ్యాయి. శుక్రవారం ముంపు గ్రామాలైన కమ్మరిగూడెం, అల్లూరినగరం, మేడేపల్లి, మాధవరం, రామవరం, గుల్లవాయి, ఒంటిబండ తదితర గ్రామాలను బాలరాజు పర్యటించి, బాధితులను పరామర్శించారు. రాబోయే రోజుల్లో ఎటువంటి ప్రమాదం జరగకుండా అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని బాలరాజు తెలిపారు.

చాఫ్ కట్టర్ బహూకరణ

పోలవరం రూరల్: స్థానిక వృద్ధాశ్రమంలోని గోశాలకు చాఫ్ కట్టర్ (గడ్డిని ముక్కలు చేసే యంత్రం)ను శుక్రవారం దాతలు బహూకరించారు. హైదరాబాద్‌కు చెందిన రెడ్డి ఆనంద నరసింహస్వామి తల్లితండ్రుల జ్ఞాపకార్థం చాఫ్ కట్టర్‌ను అందజేసినట్లు బంధువులు తెలిపారు. ఆశ్రమానికి చాఫ్ కట్టర్‌ను అందించడంలో స్థానిక ప్రభుత్వ హైస్కూల్ 1977 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు కృషి చేశారు. దాతలు, తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న రహదారులు

వేలేరుపాడు: రహదారులు దెబ్బతినడంతో 29 గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు నిలిచిపోయాయి. కొట్టుకుపోయిన వంతెనల అప్రోచ్‌లు, రహదారులకు భారీగా గండ్లతో రాకపోకలు స్తంభించాయి. ఎడతెరపి లేకుండా లేకుండా కురుస్తున్న వర్షాలకు వేలేరుపాడు మండలంలో అనేక రహదారులు వంతెనలు పూర్తిగా దెబ్బ తిన్నాయి. వేలేరుపాడు మండలంలోని కోయిదా వెళ్లే రహదారిలో మేళ్ల వాగు ఎద్దుల వాగు టేకూరు వాగుల వద్ద వంతెనల అప్రోచ్లకు భారీగా గండ్లు పడ్డాయి. మేడేపల్లి నుంచి వేలేరుపాడు వెళ్లే రహదారిలో అల్లూరు నగర్, కోయమాదారం, రామవరం ప్రాంతాల్లో భారీగా గండ్లు పడటంతో ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లే పరిస్థితి లేదు.

నిండా ముంచిన వర్షాలు

- వదలని వాన
- ఏజెన్సీలో పొంగిపొర్లుతున్న కొండవాగులు

బుట్టాయగూడెం: ఏజెన్సీ ప్రాంతంలో వర్షం ఎడతెరిపి లేకుండా కురుస్తూనే ఉంది. గురువారం బుట్టాయగూడెం మండలంలో అత్యధికంగా 268.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో కొండవాగులు బుసలు కొడుతూ పొంగి పొర్లాయి. పలు గ్రామాల్లోకి వరద నీరు వచ్చి చేరడంతో ప్రజలు అనేక అవస్థలు పడ్డారు. మండలంలోని రెడ్డి గణపవరం సమీపంలో వాగు పొంగడంతో ఎస్సై కె.వెంకన్న ఆధ్వర్యంలో వాగు వద్ద పికెటింగ్ ఏర్పాటు చేసి, ప్రయాణికులు వాగు దాటకుండా ఏర్పాటు చేశారు. అదే విధంగా ఇప్పలపాడు సమీపంలోని జల్లేరు వాగు ప్రవాహానికి తూరల్లో చెత్తా చెదారం అడ్డురావడంతో వాటిని జేసీబీతో తొలగించారు. రౌతుగూడెం సమీపంలో రోడ్డుకు అడ్డంగా చెట్ల కొమ్మలు విరిగి పడటంతో వాటిని జీలుగుమిల్లి సీఐ టి.క్రాంతికుమార్ ఆధ్వర్యంలో పోలీసులు కొమ్మలను తొలగించారు. అలాగే మరో మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ ప్రకటించిన నేపథ్యంలో కొండవాగుల వద్ద పికెట్‌లను ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా భారీ వర్షాల కారణంగా 180 ఎకరాల వరి నారుమడులు, 1140 ఎకరాల్లో వరినాట్లు నీట మునిగినట్లు చెప్పారు. అదే విధంగా 70 ఎకరాల ప్రత్తిలో ఇసుక మేట్లు వేసినట్లు వ్యవసాయశాఖ ఏడీఏ బుచ్చిబాబు తెలిపారు. కాగా ఈ వర్షాలకు నియోజకవర్గంలోని సుమారు 38 పంటలు నీటమునిగినట్లు ఆయన పేర్కొన్నారు.

కళ్లెరజేసిన ఎర్ర కాలువ

జంగారెడ్డిగూడెం రూరల్: భారీ వర్షాలకు జంగారెడ్డిగూడెం మండలంలోని కొంగువారిగూడెం శ్రీకరాటం కృష్ణమూర్తి ఎర్రకాలువ జలాశయం ఉగ్రరూపం దాల్చింది. దీంతో ఎర్రకాలువ కళ్లెరజేసినట్టు కనబడుతుంది. పంగిడిగూడెంలో అధిక సంఖ్యలో రైతుల పొలాలు నీటమునిగాయని సర్పంచ్ కోట వెంకటేశ్వరరావు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మండలంలోని 2,300 ఎకరాల్లో నాట్లు వేసిన పొలాలు నీట మునిగినట్లు మండల వ్యవసాయ అధికారి పోశారావు తెలిపారు. మండలంలో నీట మునిగిన పొలాలను జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా, కెఆర్‌పురం వ్యవసాయ శాఖ ఏడీఏ బుజ్జిబాబు, మండల వ్యవసాయాధికారి పోశారావులు పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా మాట్లాడుతూ వర్షాలకు వివిధ దశల్లో ఉన్న వరి పంటలకు నష్టం వాటిల్లకుండా రైతులు పలు జాగ్రత్తలు పాటించాలన్నారు. విత్తిన 7 నుంచి 30 రోజుల మధ్యలో నారు 5 రోజులు కన్నా మునిగితే నారు దెబ్బతినే అవకాశం ఉందన్నారు. మునిగిన నారుమడిలో నీరు 5రోజుల లోపు పూర్తిగా బయటకు తీసి వేసిన తర్వాత 5 సెంట్ల నారుమడికి 1 కిలో యూరియా ప్లస్ -1, కిలో పొటాష్, వేసుకోవాలన్నారు. అలాగే 1 గ్రాము కార్బెండిజిమ్ లేదా 2 గ్రా: కార్బెండిజిమ్ ప్లస్, మాంకోజెట్ పిచికారి చేయాలన్నారు. పిలకల దశలో వరి పంట మునిగితే నీరు బయటకు పోయిన తర్వాత ఎకరానికి 20 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ అదనంగా వేసుకోవాలన్నారు.



గూటాల ప్రాంతంలో ముంపునకు గురైన పొలాలు



బుట్టాయగూడెం: కల్వర్టు వద్ద వరదలో చిక్కిన చెత్తను తొలగిస్తున్న దృశ్యం



నీట మునిగిన వరి పొలాలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా

పొంగి పొర్లుతున్న కొండవాగులు

పోలవరం రూరల్: అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు పోలవరం మండలంలోని కొండవాగులు ఉధృతంగా పొంగి ప్రవహిస్తున్నాయి. శుక్రవారం ఉదయానికి మండలంలో 120.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో మండలంలోని కొవ్వాడ కాలువ, పేడ్రాల, నక్కల గొయ్యి, ఇసుక కాలువలు పొంగి ప్రవహిస్తున్నాయి. కడెమ్మ స్లూయిజ్ ద్వారా కొండవాగుల నీరు గోదావరి నదిలోకి చేరుతోంది. అలాగే కొవ్వాడ అధిక జలాలు పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి గోదావరి నదిలోకి చేరుతున్నాయి. పొలాలన్నీ వర్షపు నీటితో ముంపునకు గురయ్యాయి. పట్టిసీమ శివక్షేత్రం చుట్టూ వరద నీరు చేరుకుంది.

ఎల్ఎన్‌డీపేట రిజర్వాయర్‌కు చేరుతున్న నీరు: పోలవరం మండలంలోని ఎల్ఎన్‌డీపేటలోని రిజర్వాయర్‌లోకి కొండవాగుల నీరు భారీగా చేరుకుంటుంది. పాపి కొండల అభయారణ్యంలో కురుస్తున్న భారీ వర్షాలతో గత రెండు రోజులుగా రిజర్వాయర్‌లోకి అధిక నీరు చేరుకుంది. శుక్రవారం నాటికి నీటి మట్టం 87.40 మీటర్లకు చేరింది. రిజర్వాయర్ ఎఫ్ఆర్ఎల్ 90.50 మీటర్లు, రిజర్వాయర్‌లోకి ఇన్‌ఫ్లో ఉందని, మరింత పెరిగితే రిజర్వాయర్ గేట్లు ఎత్తేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని రిజర్వాయర్ ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.

ద్వారకాతిరుమల: రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో పంట పొలాలు నీట మునిగాయి. అలాగే గ్రామీణ ప్రాంత రోడ్లతో పాటు, పలు ప్రధాన రహదారులు సైతం కాలువలను తలపిస్తున్నాయి. ఈ క్రమంలో సత్తాల గ్రామ పంచాయితీలోని కొందరు రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పొలాలు పూర్తిగా నీట మునిగాయి.



వరద ఉధృతిని పరిశీలిస్తున్న ఇరిగేషన్ శాఖ సూపరింటెండెంట్



ద్వారకాతిరుమల నీట మునిగిన వరి పంటలు



పట్టిసం ఔట్‌ఫాల్ స్లూయిజ్ నుంచి దిగువకు చేరుతున్న నీరు

పంట నష్ట నివారణకు చర్యలు



నీట మునిగిన వరి చేలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

కామవరపుకోట: అధిక వర్షాలకు పంట నష్టం జరగకుండా రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సి.పవన్ కుమార్ తెలిపారు. మండలంలో కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు రావికంపాడు, గుంటుపల్లి, కేఎస్.రామవరం, కామవరపుకోట గ్రామాలలో నీట మునిగిన వరి నారుమడులను, నాటిన వరి చేలను ఆయన పరిశీలించి, రైతులకు పలు సూచనలు చేశారు. మండలంలో ఇప్పటి వరకు నీటి మునిగిన వరి నారుమడులు 25 ఎకరాలు, వరి పొలాలు 121 ఎకరాలు ముంపునకు గురైనట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి విత్తిన 7 నుంచి 30 రోజుల మధ్యలో నారుమడి 5 రోజుల కన్నా ఎక్కువగా నీట మునిగితే నారు దెబ్బతినే అవకాశం ఉంది. కావున నారు నీట మునిగిన 5 రోజుల లోపు నీటిని పూర్తిగా బయటకు తోడాలని, పంటకు గాలి తగిలేలా చేసి, 5 సెంట్ల నారుమడికి ఒక కిలో యూరియా, ఒక కిలో మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేయడం వలన కొత్త ఆకు వచ్చి ఊడ్పులకు అనుకూలంగా ఉంటుందన్నారు. తెగుళ్ల బారిన పడకుండా, నీరు పూర్తిగా తీసి వేసి మొక్క నిలదొక్కుకున్న తరువాత లీటరు నీటికి ఒక గ్రాము కార్బెండిజం లేదా రెండు గ్రాముల కార్బెండిజం, మాంకోజెబ్ కలిపిన మిశ్రమాన్ని పిచికారీ చేయాలన్నారు. నాట్లు వేసిన వెంటనే, పిలక దశలో ముంపునకు గురైనట్లైతే, నీటిని పూర్తిగా బయటకు తీసివేసి తరువాత పైపాటుగా ఎకరాకు 20 కిలోల యూరియా, 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ అదనంగా వేసుకోవాలన్నారు. ఈ విధంగా బూస్టర్ డోస్ వేసుకోవడం వలన మొక్క ముంపు ప్రభావం నుండి త్వరగా కోలుకుంటుంన్నారు. పొలంలో నీరు మురుగు కాలువల ద్వారా బయటకు వెళ్లేటట్లు బాటలు వెయ్యాలని రైతులకు పలు సూచనలు చేశారు.

శాకంబరీదేవిగా కనకదుర్గమ్మ

కొయ్యలగూడెం: ఆషాఢ శుక్రవారం సందర్భంగా కొయ్యలగూడెం బయ్యన్నగూడెం గ్రామాలలో కొలువైన శ్రీ చక్ర సహిత కనకదుర్గమ్మ శాకంబరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు అమ్మవార్లను పలు రకాల కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు, కందమూలాలతో అలంకరించి అభిషేకించారు.

చేతుల పరిశుభ్రత ముఖ్యం

జంగారెడ్డిగూడెం: వ్యాధులకు మూలం చేతులు అపరిశుభ్రంగా ఉండటమేనని, ఎల్లప్పుడు చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీఈవో అబ్రహాం అన్నారు. జంగారెడ్డిగూడెం జెడ్పీ బాలుర హైస్కూల్‌లో డెటాల్ బనేగా స్వస్థ ఇండియా(డీబీఎస్‌ఐ) కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. డివిజన్‌లోని ఉన్నత పాఠశాలలు, ప్రాథమికోన్నత పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులకు శిక్షణ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డీఈవో అబ్రహాం, ఎంఈఓలు రాముడు, రాములు హాజరై విద్యార్థులకు చేతుల శుభ్రతను వివరించారు. డీబీఎస్‌ఐ స్టేట్ ప్రాజెక్టు మేనేజర్ ఏఎస్ కుమారి, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ నళిని, రిసోర్స్ పర్సన్ ప్రసాద్ పాల్గొన్నారు.

గుబ్బల మంగమ్మ దర్శనం నిలిపివేత

బుట్టాయగూడెం: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో బుట్టాయగూడెం మండలం కామవరం అటవీ ప్రాంతంలో కొలువైన గుబ్బల మంగమ్మ దర్శనాన్ని ఆలయ కమిటీ వారు నిలిపివేశారు. గురువారం కురిసిన భారీ వర్షాలకు రహదారి వెంబడి వాగుల ప్రవాహానికి ఇసుక మేట్లు వేశాయి. అలాగే పలుచోట్ల చెట్లు విరిగిపడ్డాయి. ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం మరమ్మతు పనులు చేపట్టారు. సర్పంచ్ కోర్సా గంగరాజు ఆధ్వర్యంలో జేసీబీతో ఇసుక మేట్లను తొలగింపు, రహదారుల మరమ్మతులు చేపట్టారు. గుబ్బల మంగమ్మ దర్శనానికి భక్తులు రావొద్దని కమిటీ సభ్యులు కోరారు.

నూకాలమ్మకు వెండి బహూకరణ

జంగారెడ్డిగూడెం: నూకాలమ్మకు శుక్రవారం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. ఆలయ కల్యాణ వేదిక వద్ద ఉత్సవ మూర్తికి పంచామృతాలు, పుణ్య నదీ జలాలతో అభిషేకం చేశారు. ఆలయ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ మాట్లాడుతూ, అమ్మ వారి వెండి చీర తయారీకి చిటికెల శ్రీను, మంగ కుటుంబ సభ్యులు 10 తులాల వెండి, కేశవపల్లి వెంకట రంగా సత్యనారాయణ, నాగమణి దంపతులు 5 తులాల వెండి, పూనెం శ్రీనివాసరావు, ప్రమీలా రాణి దంపతులు 5 తులాల వెండిని బహూకరించారని తెలిపారు.

రెడ్‌బుక్ రాజ్యాంగంతో కూటమి పాలన

మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

బుట్టాయగూడెం: రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగంతో కూటమి ప్రభుత్వం రాజ్యమేలుతోందని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు విమర్శించారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ నెల రోజుల్లోనే రాష్ట్రంలో హత్యలు, అత్యాచారాలు, దౌర్జన్యాలతో పేట్రేగిపోయాయన్నారు. నెల రోజుల వ్యవధిలో వేధింపులు తాళలేక 35 మందికి పైగా ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. అలాగే 1050 మందిపై దౌర్జన్యాలు, 300 మందిపై హత్యాయత్నాలు, 31 మందిని హత్య చేసినట్లు చెప్పారు. ముఖ్యంగా వినుకొండలో నడిరోడ్డుపై అందరూ చూస్తుండగా రషీద్ అనే కార్యకర్తను అత్యంత దారుణంగా కత్తితో నరకడాన్ని తీవ్రంగా ఖండించారు. అదేవిధంగా వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్‌రెడ్డిపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అధైర్య పడొద్దు వారికి అండగా ఉంటామని తెలిపారు. అలాగే టి.నర్సాపురం మండలం కృష్ణాపురానికి చెందిన భూక్యా వేణు అనే వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై కూడా దాడి చేశారని ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులపై దాడులు చేయాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వంలో పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తామన్నారు.



మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

ముంపు ప్రాంతాల క్షేత్రస్థాయి పరిశీలన



దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు



వరద ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో జి.శ్రీను

కుకునూరు: భారీ వర్షాలతో పాటు గోదావరి వరదల నేపథ్యంలో కుక్కునూరు మండలంలోని గ్రామాలలో మునిగిన ప్రత్తి పంటను, వరినారు మడులను రైతులతో కలిసి మండల వ్యవసాయ అధికారి రెంటపల్లి బాలాజీ శుక్రవారం సందర్శించారు. గడిచిన మూడు రోజులుగా భారీ వర్షాలు కురవడం, ఇంకా రెండు రోజులపాటు భారీ నుండి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించినందున, దీనికి తోడు గోదావరి వరదల కారణంగా ప్రస్తుత పరిస్థితుల్లో కొత్తగా నారు మడులు కానీ, కొత్తగా ప్రత్తి విత్తే పనులు చేపట్టవద్దని రైతాంగానికి సూచించారు. సాధ్యమైనంత వరకు పొలాలలో నీరు నిలవకుండా మురుగునీటి పారుదల వసతిని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వర్షాలు తగ్గి సాధారణ పరిస్థితులు వచ్చిన వెంటనే నారు మడి దశలో ఉన్న వరి పంట విత్తనం చల్లిన 2-3 రోజుల వయసులో ఉన్నప్పుడు మొలక శాతం గణనీయంగా తగ్గుతుంది. ఈ దశలో వీలైనంత త్వరగా నీటిని పూర్తిగా బయటకు తీసి వేయడం వలన విత్తనం గాలి పోసుకుని ఎటువంటి నష్టం వాటిల్లదని తెలిపారు. విత్తిన 7 నుంచి 25 రోజుల మధ్యలో నారుమడి 5 రోజుల కన్నా ఎక్కువగా నీట మునిగితే, నష్ట నివారణకు నీటిని తీసి వేసిన తర్వాత, 5 సెంట్ల నారుమడికి ఒక కిలో యూరియా, ఒక కిలో పొటాష్ చల్లడం వలన కొత్త ఆకులు ఏర్పడి ఊడ్పులకు అందుతుంది. ఈ పర్యటనలో రైతులతో పాటు గ్రామ వ్యవసాయ సహాయకులు సౌజన్య, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

తహసీల్దార్ పరిశీలన

టి.నరసాపురం: అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలో వాగులు పొంగుతున్నాయి. మండలంలోని జమ్మి చెరువు కాలువ పొంగి ప్రవహిస్తుండటంతో మక్కినవారిగూడెం - టి.నరసాపురం గ్రామాల మధ్య కనకదుర్గమ్మ గుడి వద్ద వర్షపు నీరు రోడ్డెక్కి ప్రవహిస్తోంది. దీంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో వరదపరిస్థితిని పర్యవేక్షిస్తూ, ఆ ప్రాంతంలోని పరిస్థితిని తహసిల్దార్ సుభాష్ పరిశీలించారు. అధికారులకు సూచనలు చేశారు.

ఎంపీడీవో పరిశీలన

పోలవరం రూరల్: అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలతో పోలవరం పంచాయతీ పరిధిలో జలమయమైన లోతట్టు ప్రాంతాలను ఎంపీడీవో జి.శ్రీను శుక్రవారం పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఎక్కడా వర్షపు నీరు నిల్వ లేకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. పోలవరం గ్రామంలోని పాత పోలవరం, ఆంజనేయస్వామి గుడి ప్రాంతం, కమ్మరగూడెం, యడ్లగూడెం ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోయే ప్రాంతాల్లోని పరిస్థితులను పరిశీలించారు. గోదావరి వరద నీటి మట్టం క్రమేపీ పెరుగుతున్నందున అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ముంపు నివారణ చర్యలు వేగవంతం

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం-పోలవరం రోడ్డులో ముంపు ప్రాంతాన్ని శుక్రవారం అధికారులు, పంచాయతీ ప్రతినిధుల చొరవతో ముంపు నివారణ చర్యలు ముమ్మరం చేశారు. మెయిన్ సెంటర్ నుంచి మిషనరీ హాస్పిటల్, వినాయకుడి గుడి వరకు వరద నీటిని జేసీబీ సాయంతో అంకాల చెరువు (పెద్ద చెరువు)లోకి మళ్లించి, రాకపోకలు పునరుద్ధరించారు. అంకాల చెరువు కన్నాపురం రోడ్డులో తూర్పు వైపు ఆక్రమణలకు గురికావడంతో రోడ్డుకు పడమటి వైపు నివాసిత ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. పది సంవత్సరాల క్రితమే కొందరు రాజకీయ నాయకుల ప్రోద్బలంతో గట్టుతో సహా చెరువు గర్భాన్ని ఆక్రమణదారులు కబ్జా చేశారని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువు ఆక్రమణలు తొలగించాలని కోరుతున్నారు. ఆర్ఐ మణి దివ్య, వీఆర్‌వో అడపా రామ్మోహన్, ఈవో సీహెచ్ సత్యనారాయణ, సర్పంచ్ ముప్పిడి విజయ్ కుమారి, వార్డు సభ్యులు ఏలేటి భాస్కర్, పూలపల్లి రవి సహాయక చర్యల్లో పాల్గొన్నారు.



వరద నీటిని జేసీబీతో మళ్లిస్తున్న అధికారులు

పారిశుద్ధ్య పనులు వేగవంతం చేయాలి

జంగారెడ్డిగూడెం: వరదలు, అధిక వర్షాల నేపథ్యంలో పారిశుద్ధ్యం పనులు వేగవంతం చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన అత్యవసర సమావేశంలో ఆమె మాట్లాడారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా పలువురు కౌన్సిలర్‌లు మాట్లాడుతూ తమ సమస్యలు వివరించారు. చిటికెల అచ్చిరాజు మాట్లాడుతూ పట్టణ పరిధిలో టెండర్లు పూర్తయినా కాంట్రాక్టర్‌లు పనులు చేపట్టలేదని, దీనికి ఇసుక సరఫరా లేదని చెబుతున్నారన్నారు. దీనిపై మేనేజర్ కేవీ రమణ వివరణ ఇస్తూ ఉన్నతాధికారులకు విషయం తెలియజేశామని, త్వరలో ఇసుక రవాణా చేపట్టి పనులు ప్రారంభిస్తామన్నారు. వలవల తాతాజీ, నేట్రు సుబ్బలక్ష్మి, నంబూరి రామచంద్రరాజు తదితరులు మాట్లాడుతూ పారిశుద్ధ్య పనులు వేగవంతం చేయాలన్నారు. పట్టణంలో కుక్కలు, పందుల బెడద ఎక్కువగా ఉందని, నిర్మూలించాలని కోరారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి విద్యుత్ అధికారులు సమావేశానికి రావడం లేదని, వారిని కూడా పిలిపించాలని కంచర్ల గీతా కుమారి కోరారు.



సమావేశంలో పాల్గొన్న కౌన్సిల్ సభ్యులు

తీర్మానాలు:

- 15వ వార్డు ఊర చెరువు, రైతు బజారు ఏరియాలో కొత్త బోరు వేసేందుకు రూ. 10 లక్షల కేటాయింపు
- పట్టణంలో వీధిలైట్ల మరమ్మతులు, మెటీరియల్ కొనుగోలుకు రూ.8 లక్షల కేటాయింపు.
- పట్టణంలో 20, 60 వాట్ల ఎల్ఈడీ బల్బుల కొనుగోలుకు రూ.14 లక్షల కేటాయింపు.
- పట్టణంలో మంచినీటి మోటార్‌లకు ఆన్‌లైన్ క్లోరిన్ డ్రోజర్స్ ఏర్పాటుకు రూ.21 లక్షల కేటాయింపు. కార్యక్రమంలో వైస్ చైర్మన్లు ముప్పిడి అంజి, కంచర్ల వాసవీరత్నం, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్ చొరవతో కదిలిన యంత్రాంగం

జంగారెడ్డిగూడెం: అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాల కారణంగా జంగారెడ్డిగూడెం సీతామహాలక్ష్మి వృద్ధాశ్రమంలో వృద్ధులు, వికలాంగులు పడుతున్న కష్టాలను మీడియా, సోషల్ మీడియాలో చూసిన కలెక్టర్ వెట్రిసెల్వి వెంటనే స్పందించారు. ఆశ్రమంలో ఆసరా లేని 20 మందికి పైగా వృద్ధులు, వికలాంగులకు ఆశ్రమ నిర్వాహకులు జయవరపు శేఖర్ అనీ తానై చూసుకుంటున్నారు. ఇదిలా ఉండగా ప్రతీ వర్షాకాలంలో ఆశ్రమంలో ఉన్న వారు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. గతంలో పలుమార్లు అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లినప్పటికీ స్పందన అంతంత మాత్రమే. కానీ నూతన కలెక్టర్ సెల్వి వెనువెంటనే స్పందించి ఆశ్రమానికి మున్సిపల్ కమిషనర్ జె.నరేంద్ర కుమార్, తహసీల్దార్ స్లీవజోషి, ఎస్సై జ్యోతిబసు, వీఆర్‌వోలను పంపించారు. అధికారులు వృద్ధుల బాగోగులను, ఆశ్రమ నిర్వహణ విషయాలను నిర్వాహకులు శేఖర్‌ను అడిగి తెలుసుకున్నారు.

ముంపులోనే లోతట్టు ప్రాంతాలు

కొయ్యలగూడెం: తుఫాన్ నేపథ్యంలో వరద ప్రవాహాలకు గురైన పలు గ్రామాలు ఇంకా ముంపు బారినే ఉన్నాయి. శుక్రవారం కొయ్యలగూడెంలోని టేకు తోట ప్రాంతం ముంపునకు గురవ్వడంతో ఇళ్లను వదిలి ప్రజలు బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. విద్యార్థులు స్కూళ్లకు వెళ్లలేక, ప్రజలు తమ దినచర్యను నిర్వహించుకోలేక బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. డ్రెయినేజీల ఆక్రమణతో వరద నీరు ఎక్కడికక్కడే నిలిచిపోయిందని ప్రజలు వాపోతున్నారు. డ్రెయినేజీలపై అక్రమ కట్టడాలను తొలగించి వరద బారి నుంచి రక్షించాలని ప్రజలు కోరుతున్నారు. కన్నాపురం, దిప్పకాయలపాడు, బయ్యనగూడెం గ్రామాలలో లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి.